భారత పుణ్యభూమిలో—

# మానవత్వం మహానేరం

(కథానిక)

ఏడుగంటలయింది. వీధి వసారాలో గోపి పడకకుర్చీలో కూర్చుని పత్రిక చదువుకుంటున్నాడు. గోపి ప్రక్కనేవున్న మంచంమీద వీధివంక చూస్తూ హరి పడుకున్నాడు. యదు లోపలినుండి కళ్ళు నలుపుకుంటూ వస్తున్నాడు. గోపి యదువంక చూశాడు. "ఏమిరా! అలా కళ్లు యెఱ్ఱబారి ఉన్నాయ్?" అన్నాడు.

యదు విసుక్కుంటూ "రాత్రి ఓచెత్త సినిమాకి పోయాను. వెధవసినిమా నిద్రకు నిద్రా దండగే డబ్బుకుడబ్బా దండగే. అసలు ఇట్లాంటి సినిమాలను ఎట్లా తీస్తారో అనుకుంటాను. ఒక్కడికీ నటన సరిగా చేతకాదు. ప్రతినాడూ నటుణ్ణనే తయారవుతాడు" అన్నాడు.

అప్పుడే ఒక గుడ్డివాడు "గుడ్డివాణ్ణి బాబయ్యా! బిచ్చం వెయ్యండి" అని అంటూ వచ్చాడు. హరి గుడ్డివాని వైపు వెళ్ళమని చేతితో సంజ్ఞ చేస్తూ, "ఈ రోజుల్లో ఆవన్నీ శంకించడానికే వీలులేదు. ప్రతిదీ డబ్బుకోసంగానే అయిపోయింది. అట్లాంటప్పుడు కళ కళకోసమే అనే దృష్టితో చూస్తే ఏమీ లాభం లేదు" అన్నాడు.

గుడ్డివానిచేతిని పట్టుకు నుంచున్న అతని తల్లి "బాబయ్యా! పిడికెడు బియ్యం వెయ్యండి, కళ్ళులేని కబోధి" అని కొంచెంబిగ్గరగా అన్నది.

గోపి చదువుతూవున్న పత్రికను కింద పారేసి పాకుం డబ్బీతీసి చేత్తో కొంచెం పొడుమును తీసుకుంటూ "ఇప్పుడేదో పనిమీదున్నాం వెళ్ళు" అన్నాడు.

గుడ్డివాని తల్లి దీనంగా గోపివంక చూస్తూ. "బాబయ్యా! రాత్రినుండీ అన్నంలేక మలమలా మాడి చస్తున్నాము. కనికరించి కొంతంత బిచ్చం వెయ్యండి బాబూ!" అన్నది.

యదు చెవులు మూసుకుంటూ "అబ్బబ్బా! ఏమిటీ గోల వెళ్ళమంటే వెళ్ళక" అని కొంచెం గంభీరంగా అన్నాడు. గుడ్డివాడు మళ్ళీ దీనంగా "పిడికెడు బిచ్చంపెట్టు బాబూ!" అన్నాడు.

హరి కొంచెం ఎఱ్ఱబారిన కళ్ళతో "ఏయ్ అమ్మాయ్ నీక్కూడా చెప్పేది బుద్ధిలా? ఎన్ని సార్లు చెప్పాలి" అన్నాడు.

గుడ్డివాని తల్లి నిమేషంలేని కళ్ళతో హరి వంక చూస్తూ "బాబూ! గతిలేని మా బిచ్చగాళ్ళందరికీ తండ్రుల్లాంటివారు.తమరే ఆలాగంటే మా గతేం కావాలిబాబూ! దయయుంచి కాస్తంత కనికరించు బాబూ!" అని కొంచెం ఆర్ద్రంగా అన్నది.

"తెల్లవారేటప్పటికి మాదుంప తెంపకపోతే మొద్దల్లే ఉన్నావు గదా కూలో నాలో చేసుకు ఏడవరాదూ! అదొల్ల కాదు. అదైతే ఒళ్ళు కదలాలిగా, ఇదైతే తేలిగ్గా వళ్లు కదలకుండా సంపాదించుకుని తినవచ్చు" అన్నాడు.

యదు తన కళ్ళలోని పుసులను తీసుకుంటూ "అసలు గుడ్డివాడు ట్రా–సంపాదనకోసం వేసిన వేషం కాని" అని హేళనంగా అన్నాడు.

గుడ్డివానితల్లి కన్నీరుకారుస్తూ "బాబయ్యా! కళ్లులేందే కలియుగమే లేదంటారు. సంపాదన కోసం ఈ వేషమే వెయ్యాలా!" అని కొంచెం సేపు ఊరుకుని మళ్ళీ తన పురాతన తమోమయ జీవితగాధను ప్రారంభించింది.

"పది సంవత్సరాలనాడు ఊరు నిండా మశూచికాలు వచ్చాయి అప్పుడు పసిబిడ్డ తల్లి నాకోడలూ, వీడూకూడా మశూచికం పడ్డారు. నా కోడలు చనిపోయింది. వీడు మాత్రం గుడ్డివాడై బ్రతికాడు. తరువాత నాలుగేళ్లకు ఆ పసిదాన కూడా మా ఖర్మానికి తగ్గట్లే ఆ మశూచికంతోనే చనిపోయింది" అని కళ్లంబడి

మేడిచర్ల గోపాలకృష్ణమూర్తి

నీళ్ళు కారుస్తూ "బాబూ! అదంతా నా పూర్వ జన్మసుకృతం. మితిలేని దుఃఖంతో వాడు ఓపికున్నన్నాళ్ళూ కూలీ నాలీ చేసి ఎలాగో బ్రతికించుకున్నా. కాని నాకిప్పుడు ఓపిక లేదు. పెద్దదాన్నయిపోయినాను. కూలి చేయలేను బాబయ్యా! నేనంటూ వాడికింకా బ్రతికున్నా కాబట్టి ఓపికున్నా లేకపోయినా ముష్టో నష్టో ఎత్తి నాపొట్టను కూడా ఎండగట్టుకుని పెడుతున్నాను. తరువాత వాడి ముఖం ఎవరు చూస్తారు బాబూ! చాలామంది గుడ్డివాళ్ళు పాటలుపాడి సంపాదించుకు బతుకుతున్నారు. వీడికదీ చాతకాదు." అని తన కళ్ళంబడి కారుతున్న కన్నీళ్ళను తుడుచుకున్నది తరువాత మళ్ళీ కొంచెంసేపాగి "మాబోటి పేదవాళ్ళకి అవయవాలన్నీ సరిగావున్నా బతకడం కష్టంగా ఉంటే కనుచూపు కూడా లేని ఈ కబోధి ఎలా బతుకుతాడు బాబూ!" అని బాష్పరుద్ధ కంఠంతో అన్నది.

ఆమె మొరంతా విశ్వంయెదుట హోరెత్తిపోతున్న సముద్రపు హోరులానే అయిపోయింది. గోపి పేలవంగా "వానికేంలేస్తూ?" అన్నాడు. ఆమె యిప్పుడు అడిగినా బ్రతిమాలినా ప్రయోజనం లేదు. అయినా మళ్ళీ ఆశాపూరిత నమ్రనిస్వనంతో అడిగింది. గోపి ముఖం యెర్రబారింది. "నీకెన్నిసార్లని చెప్పాలి బుద్ధిలా! తెల్లవారేటప్పటికి అరగదంచిన బియ్యం నీకోసం దాచుంచా మనుకున్నావేం? పదపద. ఈసారి మెదిలావంటే కర్రపెట్టి గెంటుతా! జాగ్రత్త!" అన్నాడు.

"వీళ్లు పట్టుకుంటే పిశాచం పట్టుకున్నట్లే. ఒక్కసారి మాటల్లో చెప్తే పోతారనుకున్నావేం? కర్రతో గట్టిగా నాలుగుతుకుతే గాని పోరు" అన్నాడు యదు.

పాపం! ఆ గుడ్డివాని తల్లి నిరాశతో క్రుంగిపోతూ వెనకకు తిరిగి వెళ్ళబోతోంది. రవి ఆ ప్రక్కనున్న గదిలో కూర్చుని ఆమె ఆక్రందనవంతా చూశాడు. ఆమెమీద తనకి అంతులేని జాలి కలిగింది. దాంతో తన స్థితిని మరిచిపోయినాడు. గబగబా లోనికిపోయి దోసెడుతో దోసెడు బియ్యంతెచ్చి గుడ్డివాని చేతులోవున్న కుండ పెంకులో పోస్తున్నాడు. ఆమె "మంచి బాబువు బాబూ! వయ్యేళ్లు వర్ధిల్లు" అని ఆశీర్వదిస్తోంది. ఆ ముగ్గురూ దెబ్బతిన్న పాముల్లాగా కేడినిట్టూర్పులు విడుస్తూ "ఎవడబ్బ సొమ్మని తెచ్చిపెడుతున్నావురా?" అని అతని చేతిమీద కొట్టారు. రవి చేయి ఆమె చేతిలోని కుండబొచ్చెకు తగిలింది. అది కిందపడి పగిలిపోయింది. బియ్యమన్నీ నేలపాలయి పోయాయి. రవికి కోపమూ ఏడుపూ ఒక్కసారే వచ్చినయ్.

వీధిలో ఎండిపోయిన కడుపుతో దవడలు జారిపోయి కళ్ళు పీక్కుపోయి "అన్నమో రామచంద్రా!" అని ఏడుస్తుండేవాని యేడుపును చూసి కన్నీళ్ళు కార్చాల్సిందే తప్ప జాలిపడి ఆకాశాన్నంటుకున్న మేడల్లో అంతఃపురాల్లో పట్టు పరుపుల్లో లోకం మరిచి నిద్రిస్తున్న స్వేతాంబరుల సింహద్వారాల్ని పగలకొట్టి పెడతానంటే ఎవరూరుకుంటారు? బంది పోటు దొంగ అని అంటారు. పాపం! రవి ఏం చేస్తాడు. అలాగే గుడ్లప్ప చెప్పి నుంచున్నాడు.

"ఏదో గతిలేని వెధవవ్వుగదా అని తిండిపెడుతూంటే తిని పడుండక ధర్మాలు కూడా మొదలుపెట్టావు. మొదలుపెట్టు, నీ సొమ్మయితేగా! ఎన్ని ధర్మాలనైనా చెయ్యవచ్చు. పోతే నాశనమై మేమే పోతాం" అన్నాడు కోపంతో యదు.

"నేను ఈ వెధవని కొంపలో ప్రవేశపెట్టేప్పుడే చెప్పాను - ఉత్త దొంగ వెధవని. లేకపోతే వాడికి అంత ఒళ్లు పొగరా? మనమంతా ధర్మం చెయ్యనివాళ్ళము వాడు ధర్మం చేసేవాడునా!" అన్నాడు గోపి.

రవి వాళ్ళవంక దీనంగా చూస్తూ "పాపం! గుడ్డివాడు. వాడికి దిక్కులేదు. వాడికే కళ్ళు వుంటే మన గడప తొక్కకుండా ఎక్కడోక్కడ కూలో నాలో ఏదో ఒకటి చేసుకుని బ్రతికేవాడు. కాని వాడికి కళ్లులేవు. వాడంతట వాడు బ్రతకలేడు. అందుకని మనమే వాణ్ణి పోషించాలి. మనం పెట్టిన పిడికెడు బియ్యంతో మన ఐశ్వర్యం తరిగిపోదు" అన్నాడు.

గోపికి ఈమాటలుశూలాలతో గ్రుచ్చినట్లయినాయి. "అంత జాలికనక వాడిమీద నీకువుంటే నెత్తినెట్టుకు పోషించు మా కొంప

నేంతీస్తావు. ఇవాళ ఇదైతే రేపు ఇంకోటవుతుంది. ఇక్కడికి నాలుగేళ్ళనుంచీ నిన్నుంచుకుని సుఖపడ్డదిచాలు. పద అవతలికి" అన్నాడు రోషంగా.

గోపికి రవికి ఆ విధంగా అనడంలో ఆంతర్యం బాగా తెలుసు. తాను వారికి దూరపు బంధువు. పేదవాడు. అందుచేత కళాశాలలో విద్యా ప్రవీణ చదువుకుంటూ వారింట్లో భోజనం చేస్తున్నాడు. వారు ఉచితంగా భోజనం పెడుతున్నామనే అహంతో రవిచేత అడ్డమైన చాకిరీ చేయించుకునేవారు. దొడ్లో గేదెదగ్గర పేడ తీయడం దగ్గరనుంచీ, వాకిట్లో కట్టెలు కొట్టేవరకూ రవిచేతే చేయించేవారు. రవి పాపం, తన చదువుకు అంతరాయం చాలా కలిగినా తన నికృష్ట జీవితానికి ఏడుస్తూ ఆ చాకిరీనంతా చేస్తూండేవాడు. కాని ఇప్పుడు ఫైనల్ విద్యార్థి అవడంచేత ఆ చాకిరీనంతా చేసి చదువుకోలేక కొంచెం వారి పనులను చేసీ చేయకుండా ఉండిపోతున్నాడు. వారికది ఇష్టం లేదు. తాము చెప్పే ప్రతి పనీ విధేయతతో చేసితీరాల్సిందేనని వారి అభిప్రాయం. అందుకని సమయం చూసి వెళ్ళగొట్టే ప్రయత్నంలోనే ఉన్నారు. అందుకని రవి ఏం చేస్తాడు ఐశ్వర్యవంతుల ఆగ్రహానుగ్రహాలకు కారణాలు పెద్దగా ఉండవు. ఏదితోస్తే అదే చేస్తారు. అందుకని అడిగినా బ్రతిమాలినా ప్రయోజనం లేదు. తలవంచుకుని వెళ్ళిపోదామనుకున్నాడు. కాని తన హృదయం యెంతో ఆవేదనాపీడితమయింది. నాలుగునెలల్లో తన చదువు పూర్తవుతుంది. దాన్ని బైటికిపోతే ఎలా పూర్తి చేయడం? అతనికేమీ తోచలేదు. పేదవాడు, ఐశ్వర్యవంతుల ఇండ్లల్లో ఉండడమే తప్పు. కాని వాళ్ళ కాళ్ళు పట్టుకోందే గతి లేదు. ఎంతో బ్రతిమాలాడు. క్షమించమని కూడా కోరాడు. వారికి దయ రాలేదు. "వెళ్ళిపో! ఇంట్లో తిని ఇంటివాసాలు లెక్కపెట్టే రకానివి" ఇంతకన్న మరోమాట లేదు. రవి తిండి గుడ్డలకి మొహంవాచిన వ్యక్తే అయినా మానవత్వాన్ని మంటకలుపుకున్న నీచుడు కాడు. ఇంక బ్రతిమాలలేదు. తాను నాలుగేళ్ళనుంచీ తిన్నదానికి కృతజ్ఞతను సూచిస్తున్నట్లుగా "సెలవు" అని అంటూ ముందుకు నడిచాడు.

కిందబడ్డ బియ్యాన్ని పోగుచేసుకొని చీరచెంగులో పోసుకుంటున్న గుడ్డివాని తల్లి పిడికెడు బియ్యంతో బతుకు తెరువే పోయిందా బాబూ! అన్నట్లు చూసింది కన్నీళ్ళు కారుస్తూ.

# చుక్కల మిణుకులు

"రమణశ్రీ"

చుక్కలు చెరగిన మిణుకుల
బొమికలు కొరికే వణుకుల
గజగజ లాడింది ప్రగతి-
గాడుపు రేగగ సముద్ధతి.

రాపాడిన దీపాల తళుకుల
రారాపిళ్ళ రతనాల కళుకుల
రాజిల్లింది గగనాల నీడ
రారాజుల చామీకరపు మేడ.

సంజెల పెదవుల పలుకులు
ఉన్నత పదవుల కులుకులు
మిన్నంటిన లోకుల గొంతులు
వెన్నంటిన మృత్యువుక్రాంతులు.

కెంజాయల వసంత సంధ్యలో
కీర్తి యోధుల పొంగే రుధిరాలు
మాపుల నల్లని ముసుగులో
పాపుల దౌష్ట్యపు యోచనలు.

తెలిరేకుల ఉషః జాగృతిలో
తొలివలపుల మొగ్గల నవ్వులు
పూర్వాశలో కుంకుమ రేఖలు
పొలుపారిన చరిత్ర శాఖలు.

ప్రకృతి రచించిన కావ్యంలో
ప్రధిత విధాల ప్రభావాలు
కవి లిఖించిన భావంలో
కలవెన్నో దొసగుల ముసుగులు.